

సోమశిలలో 28.87 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారం సాయంత్రానికి 28.87 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 3425 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.99,860
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,041
3 శాతం జీఎస్టీతో	రూ.9,312
నవర (8 గ్రా)	రూ.74,496

గరిష్టం/కనిష్టం
38.6 /29.7

వాతావరణం

జిల్లాలో అక్కడక్కడా ఆకాశం మేఘావృతమై ఉంటుందని వాతావరణ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 56 శాతంగా గురువారం నమోదైంది.

న్యూస్‌రీల్

ప్రసన్నకు పరామర్శ



నెల్లూరు(పొగతోట): చెన్నైలోని ఎంజీఎం హాస్పిటల్లో చేతికి వైద్యం చేయించుకొని నగరంలోని తన నివాసానికి మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి గురువారం ఉదయం చేరుకున్నారు. ఈ క్రమంలో మాజీ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు ఆయన నివాసానికి వచ్చారు. వివిధ అంశాలపై చర్చించారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (టౌన్): జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం విద్యాశాఖ, న్యూఢిల్లీ ఆధ్వర్యంలో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారని డీఈఓ బాలాజీరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. nationalawardstoteachers.education.gov.inలో ఈ నెల 13లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తుతో పాటు సంబంధిత సర్టిఫికెట్లను జతచేసి పాఠశాల విద్యా శాఖ కమిషనర్, అమరావతి కార్యాలయానికి ఈ నెల 15లోపు పంపాలని సూచించారు.

పీ4 అమలుపై ప్రత్యేక దృష్టి



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఆనంద్ తదితరులు

నెల్లూరు రూరల్: జిల్లాలో పీ4 కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించామని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. పీ4 అమలుపై అమరావతిలోని సచివాలయం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ గురువారం నిర్వహించారు. కలెక్టరేట్లోని శంకరన్ హాల్ నుంచి కలెక్టర్ తదితరులు హాజరయ్యారు. జిల్లాలోని పలు కంపెనీల పారిశ్రామికవేత్తలతో ఇప్పటికే సమావేశాన్ని నిర్వహించామని, అందర్నీ సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాన్ని జిల్లాలో పక్కాగా అమలు చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. కమిషనర్ నందన్, డీపీఓ శ్రీధర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, డీఆర్డీఏ పీడీ నాగరాజకుమారి, సీపీఓ నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.


రెండో రోజూ దీక్ష

నెల్లూరు(బారకాసు): అక్రమ బదిలీని వెంటనే రద్దు చేయాలని కావలి మున్సిపాల్టీ పరిధిలోని సచివాలయంలో విధులు నిర్వర్తించే వెల్ఫేర్ సెక్రటరీ రావెళ్ల భాస్కర్ కోరారు. నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగం ఎదుట ఆమరణ దీక్షను రెండో రోజు గురువారం కొనసాగించారు. తనకు న్యాయం జరిగేంత వరకు దీక్ష చేపడతానని ఆయన పేర్కొన్నారు.

పోలీసుల మౌనవ్రతం

అధికార పార్టీ ఆగడాలకు వత్తాసు పలుకుతూ.. వారికి వంతపాడటానికే పోలీస్ శాఖ పరిమితమవుతోంది. మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై టీడీపీ మూకలు దాడి చేసి 72 గంటలు దాటినా, ఎలాంటి చర్యలను వారు చేపట్టకపోవడంతోనే పరిస్థితి ఏమిటో అర్థమవుతోంది. ఈ ఉదంతంపై ఫిర్యాదు చేసినా, నేటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ పరిణామాల క్రమంలో ఖాకీల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాస్వామ్యంలో హక్కుల ఉల్లంఘనకు ఇది నిదర్శనంగా నిలుస్తోంది.

- మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్న ఇంటిపై టీడీపీ వర్గీయుల హింసాత్మక దాడి
- ఫిర్యాదు చేసినా, న్యాయమైన చర్యకు నోచుకోని వైనం
- ఖాకీల తీరుపై విమర్శలు
- ప్రజాస్వామ్యంలో హక్కుల ఉల్లంఘనకు నిదర్శనం



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై టీడీపీ వర్గీయులు హింసాత్మక దాడికి పాల్పడి మూడు రోజులైంది. దాడికి గల సూత్రధారులు, పాత్రధారులెవరనే విషయం ఇప్పటికే వెలుగులోకి వచ్చింది. బాధ్యులపై చర్యలు చేపట్టాలని ఫిర్యాదు చేసినా, నేటికీ ఎలాంటి కేసును ఖాకీలు నమోదు చేయలేదు. వాస్తవానికి కాగ్నిజబుల్ అఫెన్స్ జరిగినప్పుడు ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేసి నిందితులపై చర్యలు చేపట్టాలని చట్టం స్పష్టంగా చెప్తోంది. బాధితుడు ఫిర్యాదు చేయని పక్షంలో, సుమోటోగా కేసు నమోదు చేయాలని న్యాయస్థానాలు పేర్కొంటున్నాయి. అయితే ప్రసన్నకుమార్‌రెడ్డి విషయంలో జిల్లా పోలీసులు అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి కేసు నమోదులో కాలయాపన చేస్తున్నారు. వీరు వ్యవహరిస్తున్న తీరు చట్ట ఉల్లంఘనేనని పలువురు విమర్శిస్తున్నారు.

వేమిరెడ్డి దంపతుల ప్రోద్బలంతోనే..

నెల్లూరు జిల్లా రాజకీయాల్లో నల్లపరెడ్డి కుటుంబానికి ఎంతో ప్రత్యేకత ఉంది. ఆరుసార్లు ఎమ్మెల్యేగా, ఓసారి మంత్రిగా ప్రసన్న.. మూడుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా ఆయన తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ప్రాతినిధ్యం వహించారు. ఎంతో హుందాగా రాజకీయాలు సాగిస్తారనే పేరు వీరికి ఉంది. అయితే వేమిరెడ్డి దంపతుల ప్రోద్బలంతో టీడీపీ మూకలు ప్రసన్న ఇంట్లో విధ్వంసం సాగించాయి. ఆయన తల్లి, పనివారిపై దాడి చేసి భయానక వాతావరణాన్ని సృష్టించాయి. ఘటనపై కేసు నమోదు చేయాల్సిన పోలీసులు.. అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఓ పథకం ప్రకారమే నిందితులకు సహకరిస్తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. మాజీ మంత్రి, ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన వ్యక్తి పరిస్థితే ఇలా ఉంటే, ఇక సామాన్యుడి సంగతి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. కేసు నమోదులో ఖాకీల కాలయాపనపై న్యాయపరంగా ఎదుర్కొనేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు సిద్ధమయ్యారు. న్యాయస్థానాల జోక్యంతో గతంలో ఇలాంటి ఘటనల్లో కేసులు నమోదు చేశారు. అధికారులు ఇప్పటికైనా స్పందించకపోతే న్యాయపరమైన చిక్కులు ఎదుర్కోక తప్పదని పలువురు న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు.

సుమోటోగా కేసు నమోదు చేయొచ్చు



కాగ్నిజబుల్ అఫెన్స్ జరిగినప్పుడు బాధితుడు ఫిర్యాదు చేయకపోయినా, పోలీసులు సుమోటోగా తీసుకొని వెంటనే ఎఫ్ఐఆర్‌ను చేయాలని సుప్రీం కోర్టు తెలిపింది. లలితకుమారి వర్సెస్ స్టేట్ ఆఫ్ ఉత్తరప్రదేశ్ కేసులో ఎఫ్ఐఆర్‌ను నమోదు చేసి విచారణ జరపాలని 2013లోనే తీర్పునిచ్చింది. తన ఇంట్లో టీడీపీ మూకలు విధ్వంసం సృష్టించారంటూ ప్రసన్నకుమార్‌రెడ్డి ఫిర్యాదు చేసి మూడు రోజులైనా కేసు నమోదు చేయకపోవడం చట్టాన్ని ఉల్లంఘించడమే. దీనిపై హైకోర్టులో ప్రైవేట్ కేసు వేస్తాం.

– చెంచురెడ్డి, న్యాయవాది

చట్ట ఉల్లంఘనే



దాడి జరిగి మూడు రోజులవుతున్నా, కేసు నమోదు చేయకపోవడం చట్ట ఉల్లంఘనే. హత్యాయత్నం కేసు నమోదు చేసి విచారణ జరపాల్సిన పోలీసులు అందుకు భిన్నంగా వ్యవహరిస్తుండటం దారుణం. వెంటనే స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– శ్రీనివాస్‌రెడ్డి, న్యాయవాది

నేరస్తులకు సహకరించడమే



కాగ్నిజబుల్ అఫెన్స్ జరిగినప్పుడు పోలీసులు బాధ్యతాయుతంగా వెంటనే ఎఫ్ఐఆర్‌ను నమోదు చేసి విచారణ జరపాలి. అలా కాని పక్షంలో కోర్టుకెళ్లి 173 క్లాస్ – 4 కింద పోలీసులపై కేసు నమోదు చేయొచ్చు. రోజుల తరబడి ఇలా వ్యవహరిస్తున్నారంటే ఆధారాలు ధ్వంసం చేసేందుకు సహకరించడమే. నిందితులకు ఖాకీలు సహకరిస్తున్నారని భావించాల్సి వస్తుంది. నిందితులకు ఎలాంటి శిక్షలు పడతాయో.. పోలీసుల నిర్లక్ష్యానికి అంతే శిక్ష పడుతుంది.

– శ్యామాచార్యులు, న్యాయవాది

అక్రమ కేసుల్లో అత్యుత్సాహం

- కూటమి ప్రభుత్వానికి పోలీసులు ఊడిగం చేస్తున్నారా..?
- వైఎస్సార్సీపీ హయాంలో స్వేచ్ఛ ఉండేది..
- అవినీతికి పాల్పడినట్లు ఒక్క ఆధారం చూపినా.. రాజకీయాలను శాశ్వతంగా వదులుకుంటా
- పోలీస్ కస్టడీలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కూటమి ప్రభుత్వంలో పోలీసులు బాధ్యతలను విస్మరించి పాలకులకు ఊడిగం చేస్తున్నారు.. అక్రమ కేసులను బనాయించడంలో ఉన్నంత శ్రద్ధ.. శాంతిభద్రతలపై లేకపోవడం విచారకరం.. నేను గర్వంగా చెప్తున్నా.. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ఖాకీలకు స్వేచ్ఛ ఉండేది.. ఇవీ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి రెండో రోజు పోలీస్ కస్టడీలో దీటుగా గురువారం సమాధానమిచ్చారు. కనువూరు చెరువులో గ్రావెల్ అక్రమ తరలింపు కేసులో ఆయన్ను వెంకటాచలం పోలీసులు న్యాయస్థాన ఆదేశాలతో రెండు రోజుల పాటు కస్టడీలోకి తీసుకొని విచారణ జరిపారు. తొలి రోజు 30.. రెండో రోజు 27 ప్రశ్నలేశారు.

ఇప్పటికే పలుమార్లు చెప్పా..

నేను ఒక్క పైసా అవినీతికి పాల్పడ్డానని పోలీసులు రుజువు చేస్తే ఎలాంటి శిక్షకైనా సిద్ధమేనని పలుమార్లు చెప్పా.. నా పాత్ర ఉందనే ఆధారాలు సేకరించి నా ముందుంచితే రాజకీయాలు, ప్రజాజీవితం నుంచి శాశ్వతంగా తప్పుకొని ఏ శిక్షనైనా అనుభవిస్తా.. కేవలం కుట్రపూరితంగా నమోదు చేసిన అక్రమ కేసులు తప్ప నేనెలాంటి తప్పూ చేయలేదు.. భవిష్యత్తులోనూ చేయబోనని కాకాణి స్పష్టం చేశారు. టీడీపీకి చెందిన బుజ్జయ్యనాయుడు గ్రావెల్‌ను అక్రమంగా తోలుకొని సొమ్ము చేసుకోగా, ఆ పార్టీ నేతలు ఇతరులపై దుమ్మెత్తి పోయడం.. ప్రత్యర్థులపై పత్రికల్లో లేనిపోని రాతలు రాయించారు. గ్రావెల్‌ను బుజ్జయ్యనాయుడు అక్రమంగా తరలిస్తూ.. టిప్పర్ల కింద మనుషుల ప్రాణాలు తీశారు.. అలాంటి వారిపై దృష్టి పెట్టకుండా సంబంధం లేని వ్యక్తులపై ఆరోపణలు చేయడం సరికాదు. రెండు రోజుల పాటు పోలీసులు విచారణ జరిపినా, ఎలాంటి సాక్ష్యాధారాలు చూపలేకపోయారంటే ఇది అక్రమంగా బనాయించిన కేసు అని తెలుస్తోంది. కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకే కక్షగట్టి అక్రమ కేసు బనాయించారు. టీడీపీ నేతల వద్ద స్టేట్‌మెంట్లు రికార్డు చేసి అక్రమ కేసు పెట్టారే తప్పా.. నాకెలాంటి సంబంధంలేదు. నిరంజన్‌రెడ్డి నా కుటుంబానికి చిరకాల మిత్రుడు.. దూరపు బంధువు. మేమిద్దరం తప్పు చేశామంటూ ఆరోపణలు చేయడం కాదు.. ఏదైనా ఒక్క రుజువున్నా శిక్షకు సిద్ధమే. మా మిత్రుడు కాబట్టే ముందస్తు కుట్రలో భాగంగా పలు కేసుల్లో నాతో పాటు నిందితుడిగా చేరుస్తున్నారు. పోలీసులు ఏ చిన్న సాక్ష్యాధారాన్ని చూపినా కోర్టుకెళ్లి న్యాయమూర్తితో నేను తప్పు చేశాను.. శిక్షించమని వేడుకుంటా. రెండు రోజులుగా పోలీసులు డొంకతిరుగుడు ప్రశ్నలతో వేధిస్తున్నారే తప్ప, ఆధారాలను చూపలేకపోతున్నారు. విచారణలో కాకాణి చెప్పిన సమాధానాలకు పోలీసులు నీళ్లు నమలాల్సి వచ్చిందని న్యాయవాది చెందులూరు శ్రీధర్‌రావు తెలిపారు. రెండు రోజల పోలీస్ కస్టడీ ముగియడంతో ఆయన్ను తిరిగి సెంట్రల్ జైలుకు పంపారు.

ముగిసిన పోలీస్ కస్టడీ

నెల్లూరు (లీగల్): కనుపూరు చెరువులో గ్రావెల్‌ను అక్రమంగా తరలించారనే కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి రెండు రోజుల పోలీస్ కస్టడీ గురువారంతో ముగిసింది. కోర్టు అనుమతితో జిల్లా కేంద్ర కారాగారం నుంచి వెంకటాచలం పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. జైలు సమీపంలోని జిల్లా పోలీస్ ట్రెయినింగ్ సెంటర్‌లో మధ్యవర్తులు, కాకాణి తరపు న్యాయవాది చెందులూరు శ్రీధర్‌రావు సమక్షంలో సీఐ సుబ్బారావు 27 ప్రశ్నలడిగారు. కోర్టు ఇచ్చిన కస్టడీ గడువు ముగియడంతో వైద్య పరీక్షలు చేయించిన అనంతరం నెల్లూరు నాలుగో అదనపు మొదటి తరగతి మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చారు న్యాయమూర్తి నిషాద్ నాజ్ షేక్ ఉత్తర్వుల మేరకు జిల్లా కేంద్ర కారాగారానికి తరలించారు.

ప్యానల్ న్యాయవాదుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాస్

నెల్లూరు (లీగల్): మధ్యవర్తిత్వంలో కేసుల పరిష్కారంలో శిక్షణ పొందిన ప్యానల్ న్యాయవాదుల పాత్ర కీలకమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ శ్రీనివాస్ పేర్కొన్నారు. శిక్షణ పొందిన ప్యానల్ న్యాయవాదులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయసేవా సదన్‌లో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. తమిళనాడుకు చెందిన సీనియర్ న్యాయవాది, శిక్షకుడు అరుణాచలం పలు అంశాలను తెలియజేశారు. శిక్షణ తరగతుల అనంతరం మధ్యవర్తిత్వంపై ప్రచార ర్యాలీని శ్రీనివాస్ ప్రారంభించారు. జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి వాణి పర్యవేక్షించారు.

మెగా పీటీఎం.. వెలవెల

- మొక్కుబడిగా నిర్వహణ
- నిధులు విడుదల చేయని ప్రభుత్వం
- స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్‌లో 20 శాతాన్ని వాడుకోవాలని ఆదేశాలు
- దీనికీ మొండిచేయే
- హెడ్‌మాస్టర్ల సొంత నిధుల వినియోగం
- తక్కువ సంఖ్యలో తల్లిదండ్రుల హాజరు
- ముఖం చాటేసిన ప్రజాప్రతినిధులు

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం గురువారం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా పేరెంట్ టీచర్ సమావేశం – 2.0 అట్టర్ ఫ్లాపైంది. దీన్ని ఒక పండగ వాతావరణంలో నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. స్వాగత ఏర్పాట్లు చేసి స్థానిక ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులను ఆహ్వానించాలని సూచించింది. గతేడాది పీటీఎంకు ప్రత్యేక నిధులు విడుదల చేసిన సర్కార్ ప్రస్తుత విద్యాసంవత్సరంలో మొండిచేయి చూపింది. ఈ తరుణంలో ఆయా స్కూళ్ల హెడ్‌మాస్టర్లు తమ సొంత డబ్బును వెచ్చించి కార్యక్రమాన్ని నామమాత్రంగా ముగించారు. హాజరయ్యేందుకు చాలా మంది తల్లిదండ్రులు ఆసక్తి చూపలేదు. కేవలం కొద్ది మందే వచ్చారు. ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీలు కొన్నింట్లో తూతూమంత్రంగా జరపగా, మిగిలిన చోట్ల అసలు ఊసేలేదు. అధికారులు సైతం కన్నెత్తి చూడలేదంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

నెల్లూరు (టౌన్): రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన మెగా పేరెంట్, టీచర్ మీట్ జిల్లాలో వెలవెలబోయింది. జిల్లాలోని 3555 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు.. 143 జూనియర్ కళాశాలల్లో 3.7 లక్షల మంది చదువుతున్నారు. ఇక్కడ పీటీఎంకు పెద్ద ఎత్తున స్వాగత ఏర్పాట్లు చేసి స్థానిక ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, అధికారులను ఆహ్వానించాలని ఆదేశించారు. సమావేశం.. అతిథులను వేదికపైకి ఆహ్వానించి మాట్లాడించడం.. తల్లిదండ్రులకు ఆటల పోటీలు.. విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ.. మెనూ ప్రకారం భోజనాన్ని వడ్డించడం.. పిల్లలకు హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డును అందజేయడం తదితరాలను తప్పక నిర్వహించాలని సర్కార్ ఆదేశించింది.

పైసా విదిల్చని వైనం

మెగా పేరెంట్ టీచర్ మీట్‌కు పైసాను రాష్ట్ర ప్రభుత్వం విదిల్చలేదు. గతేడాది ప్రత్యేక నిధులను విడుదల చేసినా, ఈ ఏడాది మొండిచేయి చూపారు. స్కూళ్లకు ఏటా విడుదల చేసే మెయింటెనెన్స్ ఫండ్‌లో 20 శాతాన్ని వినియోగించుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే దీన్ని నేటికీ ఆయా పాఠశాలల హెడ్‌మాస్టర్ల ఖాతాల్లో జమచేయలేదు. ఈ తరుణంలో వారే స్వయంగా నిధులను వెచ్చించాల్సి వచ్చింది.



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



మొక్కను పంపిణీ చేస్తున్న కలెక్టర్ ఆనంద్

విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఫండ్

వాస్తవానికి విద్యార్థుల సంఖ్య ఆధారంగా స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్‌ను విడుదల చేస్తారు. ఒక్కో పాఠశాలలో విద్యార్థులను బట్టి రూ.10 వేల నుంచి రూ.లక్షను కేటాయిస్తారు. ఈ లెక్కన 20 శాతం అంటే రూ.రెండు వేల నుంచి రూ.20 వేల వరకు వెచ్చించొచ్చు. అయితే రూ.20 వేలొచ్చే పాఠశాలలు పదుల సంఖ్యలో ఉన్నాయి. ఒక వేళ ఈ నిధులను ఖర్చు చేసినా, రానున్న రోజుల్లో విడుదల చేస్తామనీ చెప్పలేదు. దీంతో మామిడాకులు, పూల కాగితాలు, చిన్న షామియానాలతో స్వాగత ఏర్పాట్లకే పరిమితమయ్యారు.

ఆటల పోటీలా.. అబ్బే


కొన్ని పాఠశాలల్లో తల్లిదండ్రులతో ఒకట్రెండు ఆటలాడించినా, మరికొన్ని చోట్ల ఆ ప్రస్తావనే కరువైంది. స్నాక్స్‌కూ దిక్కులేదు. పాఠశాలల్లో విద్యార్థులకు నిత్యం వడ్డించే భోజనమే కావడంతో పలువురు వెనుదిరిగారు. మొక్కలను మాత్రం మొక్కుబడిగా అందజేశారు.

ఒక స్కూల్‌కే ఎమ్మెల్యే, మంత్రి పరిమితం

పీటీఎంకు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఎక్కడా హాజరుకాలేదు. నగరంలోని ఆరెస్సార్ స్కూల్‌కు ఎంపీ వేమిరెడ్డితో కలిసి మంత్రి నారాయణ హాజరయ్యారు. వీఆర్ హైస్కూల్ చుట్టూ రెండు నెలల పాటు ప్రదక్షిణలు చేసిన మంత్రి నారాయణ, పీటీఎంకు ముఖం చాటేశారు. ఈ వ్యవహారం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. మహాత్మాగాంధీనగర్‌లోని మున్సిపల్ స్కూల్‌కు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి.. వైవీఎం స్కూల్లో నిర్వహించిన సమావేశానికి కలెక్టర్ హాజరయ్యారు. మిగిలిన చోట్ల కార్పొరేటర్లు లేదా స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలతోనే నిర్వహించారు. కాగా పీటీఎంపై డీఈఓ బాలాజీరావును సంప్రదించగా, మళ్లీ ఫోన్ చేస్తానని పెట్టేశారు. మరోసారి ఆయన అందుబాటులోకి రాలేదు.

‘కృష్ణపట్నం’ కేసులో ఊరట

నెల్లూరు (లీగల్): కృష్ణపట్నం పోర్టు లారీ, కంటైనర్ ఓనర్స్‌తో పాటు కృష్ణపట్నం లాజిస్టిక్స్ పేరుతో అసోసియేషన్‌ను ఏర్పాటు చేయించి లారీ, కంటైనర్ ఓనర్లను బెదిరించి అక్రమంగా ఎక్కువ బాడుగలను వసూలు చేశారంటూ కాకాణి గోవర్ధన్‌రెడ్డిని మొదటి ముద్దాయిగా చూపుతూ ముత్తుకూరు పోలీస్‌స్టేషన్లో కేసు నమోదైంది. ఈ కేసులో గోవర్ధన్‌రెడ్డికి రైల్వే కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి నిషాద్ నాజ్ షేక్ బెయిల్‌ను మంజూరు చేశారు. కాకాణి తరపున సీనియర్ న్యాయవాదులు రామిరెడ్డి రోజారెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, విజయకుమారి, సిద్ధన సుబ్బారెడ్డి వాదించారు.



చికెన్ వ్యర్థాలు తరలిస్తుండగా..

• మినీలారీ పట్టివేత


సీజ్ చేసిన మినీలారీ

కొడవలూరు: చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న మినీలారీని కొడవలూరు ఎస్సై సీహెచ్ కోటిరెడ్డి గురువారం పట్టుకున్నారు. వాహనం అల్లూరు వైపు వెళ్తుండగా టపాతోపు వద్ద దుర్వాసనను గుర్తించి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి లారీని సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. కోవూరు నియోజకవర్గంలో చేపల గుంతలు అధికంగా ఉన్నాయి. ఇక్కడి వ్యాపారులు తమిళనాడు నుంచి వ్యర్థాలను తరలిస్తున్నారు. పోలీసులు దాడులు చేసి వాహనాలను సీజ్ చేస్తున్నా ఆగడం లేదు. కోర్టును ఆశ్రయించి వాహనాలను రిలీజ్ చేసుకునే వెసులుబాటు ఉండడంతో వ్యాపారాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. వ్యర్థాలతో వాహనాలు గ్రామాల మీదుగా వెళుతుండటంతో దుర్వాసన కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. చికెన్ వ్యర్థాలతో పెరిగిన చేపలను తినడం ద్వారా అనేక రకాల వ్యాధులు వస్తాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీనిని పూర్తిగా అరికట్టడం పోలీసులకు సవాల్‌గా మారింది.

అడవిలో జగనన్న విద్యాకానుక కిట్లు


విద్యాకానుక కిట్లు

ఉదయగిరి: గతేడాదికి సంబంధించిన జగనన్న విద్యాకానుకలోని బూట్లు, ఇతర వస్తువులు ఉదయగిరి పట్టణ శివారు ప్రాంతంలోని సీతారామపురం వెళ్లే రోడ్డు మార్గంలో గురువారం కనిపించాయి. వీటిని విద్యార్థులకు అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించి ముళ్ల పొదల్లో పడేశారు. ఇక్కడ దొరికిన విద్యాసామగ్రి బస్తాలపై మర్రిపాడు మండలం కేజీబీవీ అని రాసి ఉంది. గుర్తుతెలియని వ్యక్తులు వాహనంలో తీసుకొచ్చి పడేశారని తెలుస్తోంది. అధికారుల తీరును పలువురు తప్పుబట్టారు. కొంతమంది వాహనదారులు గుర్తించి వాటిలో బూట్లను తీసుకెళ్లారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ముగిసిన వరాల పండగ


విద్యుద్దీపకాంతుల నడుమ శోభిల్లుతున్న దర్గా


స్వర్ణాల చెరువులో భక్తులు

• బారాషహీద్ దర్గాకు లక్షలాది మంది భక్తుల రాక
• చివరిరోజూ కొనసాగిన రద్దీ

నెల్లూరు(బారకాసు): విద్య, ఉద్యోగం, ఆరోగ్యం, సౌభాగ్యం, గృహం ఇలా కోరిన కోరికలు తీరాలంటూ ఐదురోజులపాటు నెల్లూరులోని స్వర్ణాల చెరువులో భక్తులు రొట్టెలు అందుకున్నారు. కోరికలు తీరితే వచ్చే ఏడాది మళ్లీ వస్తామంటూ మొక్కుకున్నారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన వరాల పండగ ఈనెల 6వ తేదీన ప్రారంభమై గురువారంతో ముగిసింది. వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు బారాషహీద్ దర్గాకు తరలివచ్చారు. గంధ మహోత్సవం కార్యక్రమం వైభవంగా జరిగింది.

ఐదో రోజూ..

దర్గాలో ఆఖరి రోజు కూడా భక్తుల రద్దీ కొనసాగింది. నగరవాసులతోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. దీంతో స్వర్ణాల తీరం కళకళలాడింది. పండగ ఏర్పాట్లపై కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, నగర పాలక కమిషనర్ నందన్ ప్రత్యేక దృష్టి సారించారు.

అధికారులకు సత్కారం

సాయంత్రం దర్గా ప్రాంగణంలోని ఏపీ టూరిజం పార్కు ఆవరణలో ఫెస్టివల్ కమిటీ ఆధ్వర్యంలో రొట్టెల పండగ ముగింపు సభను గురువారం రాత్రి నిర్వహించారు. నిర్వహణలో క్రియాశీలక పాత్ర పోషించిన అధికారులకు సత్కారం చేశారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి చేతుల మీదుగా జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ అనూష, దర్గా కమిటీ చైర్మన్ ఖాదర్‌బాషా, నగర డీఎస్పీ సింధుప్రియ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య, సిటీ ప్లానర్ హిమబిందు, కార్పొరేషన్ అధికారులు, దర్గా కమిటి సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎప్పుడు తెరుస్తారో..

• తరచూ సచివాలయం మూత


ఉదయం 11 గంటలకూ తెరుచుకోని సచివాలయం

ఉలవపాడు: మండల కేంద్రం ఉలవపాడులోని రెండో సచివాలయం తరచూ మూసివేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. గతంలో ఒకసారి ఇలానే మూసివేయడంతో పత్రికల్లో కథనాలు వచ్చాయి. అయినా సిబ్బంది తీరులో మార్పు రాలేదు. గురువారం ఉదయం 11 గంటల సమయంలో కూడా తలుపులు తీయలేదు. 12 గంటల వరకు వేచి చూసిన ప్రజలు తిరిగి వెళ్లిపోయారు. ఉద్యోగుల నిర్లక్ష్య వైఖరితో కనీసం తలుపులు కూడా తీయడం లేదని పనులు నిమిత్తం తిరిగే వారు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.25
సన్నవి : రూ.15
పండ్లు : రూ.5



రెడ్‌క్రాస్ ద్వారా సేవ చేశాం

• ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి


మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): 'జిల్లా రెడ్‌క్రాస్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేశాం. అవి నాకు అవార్డులకు మించి ఎంతో తృప్తినిచ్చాయి' అని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన నెల్లూరులో మాట్లాడారు. రెడ్‌క్రాస్‌లో చేసిన సేవలకు గుర్తింపుగా బుధవారం గవర్నర్ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్‌ను అందుకోవాల్సి ఉందన్నారు. కొన్ని అనివార్య కారణాలతో విజయవాడకు సమయానికి చేరుకోలేకపోయానన్నారు. గోల్డ్‌మెడల్ అందుకోలేకపోవడం బాధగా అనిపించడం లేదన్నారు. 15 మంది మేనేజింగ్ కమిటీ సభ్యులు, 13 మంది కన్వీనర్లు, 13 మంది కో-కన్వీనర్లు అందించిన ప్రోత్సాహంతో జిల్లాలో సేవా కార్యక్రమాలు చేశామన్నారు. కోవిడ్, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలకు అందుబాటులో ఉండి సేవచేసే అవకాశాన్ని భగవంతుడు కల్పించారన్నారు. అప్పటి కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు రెడ్‌క్రాస్ అభివృద్ధిలో తోడ్పాటునందించారని చెప్పారు. ఆయన కూడా గోల్డ్‌మెడల్ అందుకోవడం సంతోషాన్ని కలిగించిందని వివరించారు. కాగా ఇటీవల రెడ్‌క్రాస్‌లో జరిగిన కొన్ని పరిణామాలు బాధ కలిగించాయన్నారు.

జిల్లా పరిషత్‌లో పదోన్నతులు


ఉత్తర్వులు అందించిన చైర్‌పర్సన్ అరుణమ్మ

నెల్లూరు(పొగతోట): జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలో పనిచేస్తున్న సీనియర్ సహాయకులకు పరిపాలనాధికారులుగా పదోన్నతులు కల్పించి వివిధ ప్రాంతాలకు బదిలీ చేశారు. ఉత్తర్వులను గురువారం జెడ్పీ కార్యాలయంలో చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సీఈఓ జె.మోహన్‌రావు అందజేశారు. దుత్తలూరు ఎంపీడీఓ కార్యాయంలో పనిచేస్తున్న ఆంజనేయులును వింజమూరుకు, ఐటీడీఏ కార్యాలయంలో పనిచేస్తున్న ఆర్‌సీసీ వర్మను జెడ్పీ కార్యాలయానికి, చిల్లకూరులో పనిచేస్తున్న సీహెచ్ అమృత వాణిని ఓజిలికి, టీపీ గూడూరులో పనిచేస్తున్న వీరకుమార్‌ను డీవీ సత్రానికి, కొండాపురంలో పనిచేస్తున్న రాజశేఖర్‌ను వరికుంటపాడుకు బదిలీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు లక్కాకుల పెంచలయ్య, భీమ్‌రెడ్డి పాల్గొన్నారు.

1,700 మందితో బందోబస్తు


పర్సును అందజేస్తున్న పోలీసులు

నెల్లూరు(క్రైమ్): బారాషహీద్ దర్గాలో ఐదురోజులపాటు జరిగిన రొట్టెల పండగ గురువారంతో ముగిసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ అధికారులు 1,700 మందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. సిబ్బంది 24 గంటలు విధుల్లో ఉన్నారు. ఐదురోజులపాటు పండగ రద్దీలో తప్పిపోయిన 200 మంది చిన్నారులను రక్షించి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. ఐదుగురు జేబుదొంగలను అదుపులోకి తీసుకుని చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించారు. ఇతర శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ ప్రశాంత వాతావరణంలో పండగ ముగిసేలా చర్యలు తీసుకున్నారు. బందోబస్తు విధులను సమర్థవంతంగా నిర్వహించిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ జి.కృష్ణకాంత్, ఏఎస్పీ సీహెచ్ సౌజన్యలు అభినందించారు.

మాజీ సైనికుల సంక్షేమానికి కృషి


అధికారులతో మాట్లాడుతున్న వెంకటరెడ్డి

నెల్లూరు రూరల్: మాజీ సైనికుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని రాష్ట్ర సైనిక సంక్షేమ శాఖ సంచాలకులు బ్రిగేడియర్ వి.వెంకటరెడ్డి తెలిపారు. గురువారం నెల్లూరులోని జిల్లా సైనిక సంక్షేమాధికారి కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు సంక్షేమ కార్యక్రమాల గురించి మాజీ సైనికులతో చర్చించారు. వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు కెప్టెన్ సత్యప్రసాద్, జిల్లా సైనిక సంక్షేమాధికారి హరికృష్ణ, మాజీ వింగ్ కమాండర్ శ్యామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి..


వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

మర్రిపాడు: మండలంలోని పొంగూరు గ్రామంలో 70 మంది గురువారం టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆ పార్టీ నాయకులు ఉర్లగంటి శ్రీనివాసులురెడ్డి, పార్లపల్లి కొండారెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన సీహెచ్ పుల్లయ్య, ఎస్.చిన్నపెంచలయ్య, డి.వెంకటేశ్వర్లు, డి.రాము, బొజ్జ చిన్నయ్య, వై.పెంచలయ్య, ఎస్.లాజర్, పి.రవి, పి.ప్రసాద్, పి.వెంకటేశ్వర్లు, ఎస్.నరసింహులు, డి.సల్మాన్, ఎ.రామయ్య, ఎస్.శాంతికుమార్, కె.సునీల్, ఎన్.అనిల్, బొజ్జ పెంచలయ్య, ఎస్.రత్నం తదితరులు చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా సమయంలో ఎన్నో సంక్షేమ పథకాలను అందించారన్నారు. కూటమి ప్రభుత్వంలో పథకాలు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అందుకే జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి వెంట నడిచేందుకు పార్టీలో చేరామన్నారు.

కరేడు భూములపై చంద్రబాబు కన్ను

• కంపెనీ పేర్లతో దోచుకునేందుకు ఎత్తుగడ
• మాజీ ఎంపీ హర్షకుమార్


రైతులతో మాట్లాడుతున్న హర్షకుమార్

ఉలవపాడు: కరేడు భూములపై సీఎం చంద్రబాబు కన్నుపడిందని అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్ ఆరోపించారు. గురువారం ఆయన కరేడు గ్రామానికి వచ్చి రైతులను కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాబు ఎక్కడెక్కడ భూములు ఉన్నాయో చూడటం, ఏదో కంపెనీకి తక్కువ మొత్తానికి ఇవ్వడం, వారి వద్ద వెనుక నుంచి డబ్బులు తీసుకోవడం, పైకేమో ఉద్యోగాలని చెప్తాడన్నారు. కరేడు గ్రామం కోనసీమ కన్నా పచ్చగా ఉందన్నారు. ఇక్కడే చంద్రబాబు ఎందుకు భూములు తీసుకుంటున్నాడని పరిశీలించానన్నారు. బనకచర్ల ప్రాజెక్ట్ పైపులైన్ కరేడు మీదుగా వస్తుందన్నారు. ఇక్కడ విద్యుదుత్పత్తి పెట్టి పైపులైన్ ద్వారా ప్రాజెక్ట్‌కు నీరు పంపే ప్రక్రియ చేయాలని చంద్రబాబు ఉద్దేశమన్నారు. ఆ భూములు తన ఆధీనంలో ఉండాలని వేసిన ప్లాన్ అన్నారు. పైకి కరేడు గురించి అవి బంజరు భూములని చెబుతున్నాడని విమర్శించారు. ఈ ప్రాంతంలో అందరూ చిన్న రైతులని, కలిసికట్టుగా ఉండి పోరాడాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట బిళ్లా చెన్నయ్య, మిరియం శ్రీనివాసులున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



నెల్లూరు(క్రైమ్): నెల్లూరు రేబాలవీధిలోని బాలాజీ లాడ్జీ వద్ద గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. కాఫీ రంగు గళ్ల లుంగీ, తెలుపు రంగు పొడుగు చేతుల చొక్కా ధరించి ఉన్నాడు. స్థానికులు నవాబుపేట పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. మృతుడి వయసు 45 నుంచి 50 ఏళ్ల మధ్య ఉండొచ్చని భావిస్తున్నారు. వివరాలు తెలిసిన వారు 94407 96306, 9440796310 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

చేపల గుంతలో పడి..

• మూడేళ్ల చిన్నారి మృతి

కోవూరు: పట్టణంలోని గాంధీ సంఘం ప్రాంతానికి చెందిన మూడేళ్ల చిన్నారి చేపల గుంతలో పడి మృతిచెందిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం మేరకు.. మనోజ్‌కు చెందిన చేపల గుంత వద్ద ఓ వ్యక్తి పనిచేస్తున్నాడు. అతడికి ఇద్దరు కుమార్తెలు సంతానం. వారిద్దరినీ తీసుకుని బుధవారం చేపల గుంత వద్దకు వెళ్లాడు. తండ్రి చిన్న పని నిమిత్తం బయటకు వచ్చాడు. ఈ క్రమంలో మూడేళ్ల వయసున్న పెద్ద కుమార్తె ఆడుకుంటూ గుంతలో పడిపోయింది. ఈ విషయాన్ని ఎవరూ గమనించలేదు. కాసేపటికి చిన్నారి కనిపించలేదని కుటుంబ సభ్యులు వెతికారు. గుంతలో మృతదేహం కనిపించింది. అయితే ఈ విషయం బయటకు రాకుండా యజమాని దాచే ప్రయత్నం చేసినట్లు సమాచారం. బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించలేదని స్థానికులు చెబుతున్నారు. చిన్నారి చేపల గుంతలో పడి మృతిచెందడం చాలా బాధాకరమని మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు జరగకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

పోలీస్ కస్టడీలో యువకుడికి చిత్రహింసలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): తన కుమారుడు చేసిన తప్పుపై కేసు నమోదు చేయకుండా కృష్ణలంక పోలీసులు చిత్రహింసలకు గురిచేశారని ఉలవపాడుకు చెందిన శ్రీనివాసరావు ఓ వీడియో ద్వారా ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడ కృష్ణలంక పోలీసులు తనకు ఫోన్ చేసి మీ కుమారుడు యశ్వంత్ స్టేషన్‌లో ఉన్నాడని చెప్పగా, తాను వెళ్లానన్నారు. పోలీసులు అతడ్ని అండర్‌వేర్‌పై కూర్చోబెట్టారని, తననుకొట్టారని కుమారుడు ఏడుస్తూ చెప్పారని వాపోయారు. వదిలి పెట్టాలంటే డబ్బివ్వాలని, లేకపోతే ఎన్‌కౌంటర్ చేయిస్తానని బెదిరించారని ఆవేదన వ్యక్తం చేశారు. వీడియో బయటకు రావడంతో కృష్ణలంక పోలీసులు అప్రమత్తమై అతడిపై చీటింగ్ కేసు నమోదు చేశారు.

చీటింగ్ కేసు నమోదు

కార్లు తాకట్టు పెట్టి నగదు తీసుకొని తప్పించుకొని తిరుగుతున్న వ్యక్తిపై కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. నిడమానూరుకు చెందిన పరిమి వంశీ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. భవానీపురంలో నివాసం ఉంటున్న ఉలవపాడుకు చెందిన దీపక్‌తో గతేడాదిలో అతడికి పరిచయమైంది. అప్పుడప్పుడూ వంశీ దగ్గర అవసరానికి డబ్బు తీసుకొని తిరిగి చెల్లించేవాడు. ఈ క్రమంలో దీపక్ సోదరుడు యశ్వంత్ పరిచయమయ్యాడు. జనవరిలో వంశీ వద్ద రూ.10 లక్షలను యశ్వంత్ అప్పుగా తీసుకున్నాడు. దానికి మూడు కార్లను కుదవపెట్టాడు. నెలలు గడుస్తున్నా డబ్బులివ్వకుండా తప్పించుకుని తిరుగుతున్న యశ్వంత్‌పై చర్యలు చేపట్టాలని వంశీ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. యశ్వంత్‌ను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించి విచారణ జరుపుతున్నామని సీఐ నాగరాజు తెలిపారు.

విశాఖపట్నం గౌరవనీయ డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ విశాఖపట్నం వారి సమక్షంలో

31-31-21, నారాయణ భవనం, సాయి బాబా వీధి, దాబాగార్డెన్స్, విశాఖపట్నం-530020.

O.A. NO.523/2025

బిట్వీన్ :
కెనరా బ్యాంక్ (ఇంతకుముందు సిండికేట్ బ్యాంక్)
కావలి బ్రాంచ్, ఎస్.పి.ఎస్.ఆర్. నెల్లూరు జిల్లా-524201 ... దరఖాస్తుదారు బ్యాంక్
మరియు
శ్రీ చండి చెన్న కృష్ణ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నవారు జిపిఎ చండి చెన్నా రెడ్డి మరియు 2 ఇతరులు

పత్రికా ప్రచురణ ద్వారా ప్రతివాదులుకు సమన్లు

ప్రతివాది-3 :
3. దేవరపల్లి సుజాత, తండ్రి : వెంకట సుబ్బా రెడ్డి, డి నెం.11-33-948/A/8, టీచర్స్ కాలనీ, వెంగళరావు నగర్, కావలి-524201.
O.A/523/2025, గౌరవనీయ ప్రెసైడింగ్ అధికారి/రిజిస్ట్రార్ ముందు తేది. 24-07-2025 న లిస్ట్ చేయబడినది. గౌరవనీయ ట్రిబ్యునల్ సెక్షన్ 19(4) క్రింద పేర్కొన్న దరఖాస్తుపై సమన్లు/నోటీసులు జారీచేయబడ్డాయి. (OA) క్రింద రూ. 59,61,643.65 పై. ఋణాల రికవరీ కొరకు దావా మీకు వ్యతిరేకంగా దాఖలు చేయబడ్డాయి. (పత్రాల కాపీలతో పాటు దరఖాస్తు మొదలైనవి జతచేయబడ్డాయి).
2. ట్రిబ్యునల్ ముందు మీరు హాజరైనప్పుడు అనుబంధంతో పాటు OA కాపీని సేకరించాలని మీకు నిర్దేశించబడింది.
3. మీరు ఏవైనా డాక్యుమెంట్లను దాఖలు చేయదలిస్తే మీరు వ్రాతపూర్వక స్టేట్‌మెంట్‌తో పాటు ఒక లిస్ట్‌తో దానిని దాఖలు చేయవచ్చును.
4. మీరు స్వయంగా లేదా తగువిధంగా సూచించిన ప్లీడర్/అడ్వకేట్ ద్వారా ట్రిబ్యునల్ సమక్షంలో మీరు హాజరయ్యేటప్పుడు మీ నమోదిత చిరునామా మరియు హాజరు మెమోను దాఖలు చేయవలెను.
5. ఇందులో తెలిపిన తేదీన మీరు హాజరగుటలో విఫలమైతే, ప్రొసీడింగ్ మీ గైర్హాజరులో విచారించబడి నిర్ధారించబడునని గమనించవలెను.
మీకు దరఖాస్తుదారు అందించిన దావా యొక్క కాపీతో వ్రాతపూర్వక స్టేట్‌మెంట్‌ను ఫైల్ చేయాలని మరియు తేది.24-07-2025 న ఉదయం 10:30 ని॥లకు ప్రిసైడింగ్ ఆఫీసర్ / రిజిస్ట్రార్ ముందు హాజరు కావాలని కూడా మీరు నిర్దేశించబడ్డారు. మీరు దరఖాస్తు చేయుటలో విఫలమైతే మీ గైర్హాజరు సమయంలో నిర్ణయం తీసుకోబడుతుంది.
నా స్వహస్తములతో మరియు ఈ ట్రిబ్యునల్ యొక్క ముద్రతో తేది 17 జూన్ 2025 న జారీచేయబడినది.
సమన్లు జారీ చేసిన అధీకృత అధికారి వారి సంతకం
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, విశాఖపట్నం

విశాఖపట్నం గౌరవనీయ డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ విశాఖపట్నం వారి సమక్షంలో

31-31-21, నారాయణ భవనం, సాయి బాబా వీధి, దాబాగార్డెన్స్, విశాఖపట్నం-530020.

O.A. NO. 528/2025

బిట్వీన్ :
కెనరా బ్యాంక్ (ఇంతకుముందు సిండికేట్ బ్యాంక్)
కావలి బ్రాంచ్, ఎస్.పి.ఎస్.ఆర్. నెల్లూరు జిల్లా-524201 ... దరఖాస్తుదారు బ్యాంక్
మరియు
దేవరపల్లి రాధిక ప్రాతినిధ్యం వహిస్తున్నవారు జిపిఎ దేవరపల్లి రామి రెడ్డి మరియు 2 ఇతరులు

పత్రికా ప్రచురణ ద్వారా ప్రతివాదులుకు సమన్లు

ప్రతివాది-3 :
3. దేవరపల్లి శ్రీకర్ గణేష్, తండ్రి: రామి రెడ్డి, డి నెం.11-33-948/A/8, టీచర్స్ కాలనీ, వెంగళరావు నగర్, కావలి-524201.
O.A/528/2025, గౌరవనీయ ప్రెసైడింగ్ అధికారి/రిజిస్ట్రార్ ముందు తేది. 24-07-2025 న లిస్ట్ చేయబడినది. గౌరవనీయ ట్రిబ్యునల్ సెక్షన్ 19(4) క్రింద పేర్కొన్న దరఖాస్తుపై సమన్లు/నోటీసులు జారీచేయబడ్డాయి. (OA) క్రింద రూ. 71,72,000.52 పై. ఋణాల రికవరీ కొరకు దావా మీకు వ్యతిరేకంగా దాఖలు చేయబడ్డాయి. (పత్రాల కాపీలతో పాటు దరఖాస్తు మొదలైనవి జతచేయబడ్డాయి).
2. ట్రిబ్యునల్ ముందు మీరు హాజరైనప్పుడు అనుబంధంతో పాటు OA కాపీని సేకరించాలని మీకు నిర్దేశించబడింది.
3. మీరు ఏవైనా డాక్యుమెంట్లను దాఖలు చేయదలిస్తే మీరు వ్రాతపూర్వక స్టేట్‌మెంట్‌తో పాటు ఒక లిస్ట్‌తో దానిని దాఖలు చేయవచ్చును.
4. మీరు స్వయంగా లేదా తగువిధంగా సూచించిన ప్లీడర్/అడ్వకేట్ ద్వారా ట్రిబ్యునల్ సమక్షంలో మీరు హాజరయ్యేటప్పుడు మీ నమోదిత చిరునామా మరియు హాజరు మెమోను దాఖలు చేయవలెను.
5. ఇందులో తెలిపిన తేదీన మీరు హాజరగుటలో విఫలమైతే, ప్రొసీడింగ్ మీ గైర్హాజరులో విచారించబడి నిర్ధారించబడునని గమనించవలెను.
మీకు దరఖాస్తుదారు అందించిన దావా యొక్క కాపీతో వ్రాతపూర్వక స్టేట్‌మెంట్‌ను ఫైల్ చేయాలని మరియు తేది.24-07-2025 న ఉదయం 10:30 ని॥లకు ప్రిసైడింగ్ ఆఫీసర్ / రిజిస్ట్రార్ ముందు హాజరు కావాలని కూడా మీరు నిర్దేశించబడ్డారు. మీరు దరఖాస్తు చేయుటలో విఫలమైతే మీ గైర్హాజరు సమయంలో నిర్ణయం తీసుకోబడుతుంది.
నా స్వహస్తములతో మరియు ఈ ట్రిబ్యునల్ యొక్క ముద్రతో తేది 17 జూన్ 2025 న జారీచేయబడినది.
సమన్లు జారీ చేసిన అధీకృత అధికారి వారి సంతకం
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, విశాఖపట్నం

కెనరా బ్యాంక్ Canara Bank
స్పెషలైజ్డ్ ఎ.ఆర్.ఎమ్. బ్రాంచ్
[illegible], 3వ అంతస్తు, 13-1 [illegible] రోడ్డు, [illegible] నగర్, [illegible], తిరుపతి-517501. ఫోన్: 7901628759

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు సర్ఫేసీ చట్టం-2002 యొక్క సెక్షన్ 13(8) క్రింద REDEMPTION NOTICE

1. M/s వినాయక గ్రానైట్స్, [illegible] శ్రీ చివి వెంకటరమణయ్య, తండ్రి: శ్రీ వెంకటసుబ్బయ్య, [illegible] ప్రకాశం జిల్లా-523105, ఆంధ్రప్రదేశ్. [illegible] 1-10-100, [illegible] ప్రకాశం జిల్లా-523105.
2. [illegible] డి.నెం. 1-10-100, [illegible] ప్రకాశం జిల్లా 523105, ఆంధ్రప్రదేశ్.
3. [illegible] డి.నం. 1-10-100, [illegible] ప్రకాశం జిల్లా 523105, ఆంధ్రప్రదేశ్.
4. [illegible] డి.నం. 1-10-100, [illegible] ప్రకాశం జిల్లా-523105, ఆంధ్రప్రదేశ్.

[illegible]

ఋణగ్రహీత/సంస్థ M/s వినాయక గ్రానైట్స్, [illegible] రూ. 23,32,432.57/- [illegible] 13(2) క్రింద 20.04.2021 [illegible]

[illegible] తేది. 29.05.2023 [illegible] 13(4) [illegible] తేది. 31.05.2023 [illegible]

ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా మీరు 30.06.2025 నాటికి [illegible] రూ. 37,82,485.54/- [illegible] 13(8) [illegible]

తేది: 04.07.2025, ప్రదేశం: తిరుపతి సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

ADMISSIONS
■ URE TRUST, Engineering Admissions Open-Tamil Nadu, Anna University Affiliated Colleges. B.Tech @ Rs. 49,000/ Year, ✆ 76610 00079, 83309 38836. [T-2504]

DIRECT FINAL YEAR
■ Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT,B.Tech,Diploma,MA,M.Com,M.Sc, MBA,MCA.Regular/lateral entry.9381287629 [T-2502]

REAL ESTATE

PLOT FOR SALE
■ కృష్ణపట్నంపోర్ట్, ముత్తుకూరురోడ్డు, కాకుపల్లి మరియు బుచ్చిరెడ్డిపాళెం వద్ద వెంటనే ఇంటి నిర్మాణానికి అనువైన నుడా ప్లాట్లు బ్యాంకు లోనుతో కేవలం 15లక్షలకే స్పాట్ రిజిస్ట్రేషన్ చేసుకొన్న వారికి రిజిస్ట్రేషన్ ఫ్రీ. వివరములకు సంప్రదించండి: 90320 14011. [NA-24299]

SERVICES

BUSINESS OFFER
■ ITR/Salary Slip లేకుండా 48 గంటల్లో హోమ్‌లోన్ పొందడం కష్టం కాదు. Home First మీకు సహాయం చేయడానికి, సలహాలకి కాల్ చేయండి :7406393937 [HA-480]

TOURS & TRAVELS
■ 11.7.25 తేదీ, 2 రోజులు టికెట్ 3250 (AC బస్సు, భోజనం, రూం) పట్టిసీమ, అష్టలక్ష్మి గుడి, వాడపల్లి, 1000 స్థంబాలు, బిక్కవోలు. కె.వాసు, నెల్లూరు. 9491340504. [NA-24296]

WANTED
■ Wanted Tally accountant (Male) 4 Years exp. with computer knowledge. Sri Durga Hotel, Nellore. Resume send to WhatsApp No: 79815 40612 [NA-5563]
■ Wanted Sales Manager and assistant sales manager in popular mobile stores are preferable. Ph.No: 9133399257, 9703333378 [G-145]
■ Wanted female telecallers work with reputed University Engineering Admission purpose Qlf:any degree, sal : 12k + con: 9000098006, 9030050505. [NA-24298]

■ Dost, Eicher - 4.5, 6.5 & 10 Ton వెహికల్‌కి డ్రైవర్లు-4 కావలెను. లైసెన్సు, బ్యాడ్జ్, అనుభవం కలవారికి ప్రాధాన్యత. నెల్లూరు. సంప్ర॥ 79815 40612. [NA-5565]
■ నెల్లూరు టౌను మరియు మహాలక్ష్మిపురం ఏరియాలలో పని చేయుటకు సెక్యూరిటీ సూపర్‌వైజర్స్, సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. సంప్ర॥ 9959444086 [NA-24295]
■ మా కంపెనీయందు, కాలేజీల యందు పనిచేయుటకు సూపర్‌వైజర్స్, స్టోర్‌ఇంచార్జి, డ్రైవర్స్,EX-ఆర్మీకా.(రూమ్,ఫ్రీ) PF,ESIజీ.18టు32వేలు.సె.9490910876 [SCA25006067]
■ నెల్లూరులో ఇంట్లో వంటపని చేయుదానికి వంట మనిషి కావలెను. సమయం : ఉదయం 7 గం॥ - సాయంత్రం 6 గం॥ వరకు జీతం : రూ.20,000/- Cont : 89855 83305. [NA-2882]
■ కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవ దానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP& డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం. Hyd.9014885406 [HA-15968]
■ ఆత్మకూరులో రాబోయే ప్రతిష్టాత్మక వెంచర్ కొరకు Motherland Developers కంపెనీ లో పనిచేయుటకు ఈ కింది స్టాఫ్ కావలెను. ఆత్మకూరు లోకల్ వారికి ప్రాధాన్యత. ఫ్రెంట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్ (2 Females), ఆఫీస్ ఎగ్జిక్యూటివ్ -(1 Male), అకౌంటెంట్-(1Male or female) Ph.8985001001 [SCA25006113]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకోనబడును.
ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.